సాక్షి విశాఖపట్నం

సోమవారం । 10 । జూలై । 2023



అలరించిన నృత్య పోటీలు

అఖిల భారత నాట్య రవళి మ్యూజిక్ అండ్ డాక్టర్స్ అకాడమీ అఖిల భారత నృత్యోత్సవాలు ఆదివారం ముగిశాయి. 8లో



ఇంటర్ అడ్మిషన్ల జోష్

ఇంటర్ అడ్మిషన్ల జోరు పెరిగింది. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడంతో ఇంటర్ విద్యకు డిమాండ్ పెరిగింది. 8లో



అర్హులందరికీ అమ్మ ఒడి 8లో

'అమ్మ ఒడి' డబ్బులు బ్యాంకుల్లో జమ కాని అర్హులైన లబ్ధిదారుల సమస్యను పరిష్కరించేలా యంత్రాంగం చర్యలు చేపడుతోంది.

న్యూస్‌రీల్

విశాఖ షూటర్లకు పతకాల పంట



పతకాలు సాధించిన విశాఖ షూటర్ల బృందం

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షూటింగ్ పోటీల్లో ఉమ్మడి కృష్ణా, గుంటూరు, విశాఖ జిల్లాల క్రీడాకారులు సత్తా చాటారు. రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(ఆర్ఏపీ) ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లోని శాట్ షూటింగ్ రేంజ్‌లో ఈ పోటీలు జరిగాయి. 10 మీటర్ల రైఫిల్, పిస్తోల్, 25 మీటర్ల పిస్తోల్, 50 మీటర్ల రైఫిల్, పిస్తోల్, షాట్‌గన్ విభాగాల్లో సబ్‌జూనియర్, జూనియర్, యూత్, సీనియర్, మాస్టర్స్, సీనియర్ మాస్టర్స్ స్త్రీ, పురుషుల కేటగిరీల్లో జరిగిన ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీల్లో అత్యధికంగా 60 పతకాలతో కృష్ణా జిల్లా ముందంజలో ఉండగా 40 పతకాలతో గుంటూరు, 28 పతకాలతో విశాఖపట్నం వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. విజేతలకు విజయవాడలోని లెమన్‌ట్రీ హోటల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పతకాలు అందజేశారు.

రేపు మధ్యాహ్నం 2.30 గంటల వరకే అప్పన్న దర్శనాలు



సింహాచలం: సింహగిరి గ్రామదేవతలు ఉమామహేశ్వరి పాదాలమ్మ, బంగారమ్మ పండగ మంగళవారం నిర్వహించనున్న నేపథ్యంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దర్శనాలు ఆరోజు మధ్యాహ్నం 2.30 గంటల వరకు మాత్రమే లభిస్తాయని దేవస్థానం ఏఈవో భ్రమరాంబ తెలిపారు. 12వ తేదీ ఉదయం 7 గంటల నుంచి దర్శనాలు యథావిధిగా లభిస్తాయని పేర్కొన్నారు. సోమవారం రాత్రి 9 గంటలకు తొలేళ్ల ఉత్సవం, మంగళవారం సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు అనుపోత్సవాలు జరుగుతాయన్నారు.

నేడు డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ మేయర్ కార్యక్రమం జరగనుంది. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో 1800 4250 0009 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి నేరుగా మేయర్‌కు సమస్యలు తెలపవచ్చు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ హాలులో జగనన్నకు చెబుదాం(స్పందన)కార్యక్రమం ఉంటుంది. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మతో కలిసి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

పడవ బోల్తా.. మత్స్యకారులు క్షేమం



ఒడ్డుకు చేరుకున్న మత్స్యకారులు

భీమునిపట్నం: భీమిలి తీరానికి సమీపంలో ఆదివారం మత్స్యకారుల పడవ బోల్తాపడింది. బోయివీధికి చెందిన కదిరి అప్పలరాజు, కాసరపు దుర్గారావు, కొక్కిరి కాశీడు, కాసారు పెంటరాజు, తెడ్డు గౌర్లయ్య, కదిరి రాజు, కాసరపు నూకరాజు, కాసరపు ఎల్లాజీ పడవలో చేపల వేటకు బయలుదేరారు. తీరానికి కొద్ది దూరం వెళ్లిన తర్వాత అలలు ఉధృతంగా రావడంతో పడవ బోల్తా పడిపోయింది. వెంటనే వీరందరూ జాగ్రత్తగా తీరానికి చేరుకున్నారు. పడవ, దానికి ఉన్న ఇంజిన్‌ను ఇతర మత్స్యకారుల సాయంతో తీరానికి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు గానీ.. పడవ, ఇంజిన్ దెబ్బ తినడంతో రూ.లక్ష నష్టం వాటిల్లిందని మత్స్యకారులు తెలిపారు. వీరిని స్థానిక నాయకుడు కదిరి ఎల్లాజీ పరామర్శించారు. వీరందరూ నిరుపేదలని, జరిగిన నష్టానికి ప్రభుత్వ సాయం అందించాలని కోరారు.

హాకీ విశాఖ సంఘం నూతన కార్యవర్గం ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: హాకీ విశాఖ సంఘానికి నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఆదివారం సంఘ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం సంఘం అధ్యక్షునిగా ఎస్.కె.ఈ.అప్పారావు, కార్యదర్శిగా కె.వి.ఆంజనేయరావు, కోశాధికారిగా టి.సత్యంను ఎన్నుకున్నారు. పలువురు సభ్యుల్ని సంఘానికి నామినేట్ చేసుకున్నారు. నాలుగేళ్లపాటు ఈ కార్యవర్గం హాకీ కార్యక్రమాల్ని జిల్లాలో నిర్వహించనుంది.

మరో చరిత్రకు నాంది

- విశాఖ–భోగాపురం మధ్య గొప్ప అభివృద్ధికి అవకాశం
- కలెక్టర్ మల్లికార్జున వెల్లడి
- ఒబెరాయ్ హోటల్ నిర్మాణ పనులకు భూమిపూజ



ఒబెరాయ్ హోటల్స్ లగ్జరీ రిసార్ట్స్‌కు భూమిపూజ కార్యక్రమంలో కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు

తగరపువలస : రానున్న 10–15 ఏళ్లలో విశాఖ–భోగాపురం మధ్య గొప్ప పట్టణం రూపుదిద్దుకుంటుందని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున అన్నారు. ఇటీవల విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ అవగాహనలో భాగంగా ఆదివారం భీమిలి మండలం అన్నవరం తీరంలో ఒబెరాయ్ హోటల్ గ్రూప్ ఏడు నక్షత్రాల సదుపాయాలతో నిర్మిస్తున్న లగ్జరీ రిసార్ట్స్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో కడప జిల్లా గండికోట నుంచి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వర్చువల్ విధానంలో సీఎంతో మాట్లాడుతూ మే 3వ తేదీన ఇక్కడకు 8 కిలోమీటర్ల దూరంలో భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు రూ.4,592 కోట్లతో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఉత్తరాంధ్ర ప్రజల కల నెరవేర్చారన్నారు. అదే రోజు మధురవాడలో రూ.21,844 కోట్లలో సుమారు 50 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించే 300 మెగావాట్ల ఇంటిగ్రేటెడ్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేశారన్నారు. ఇప్పుడు రూ.350 కోట్లతో 40 ఎకరాలలో ఏడు నక్షత్రాల సదుపాయాలతో 300 విల్లాస్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నారన్నారు. దీని ద్వారా 5,500 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. 65 రోజుల వ్యవధిలో ఈ మూడు ప్రాజెక్టుల ద్వారా రూ.26 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, ఇందుకు జిల్లా ప్రజల తరపున ధన్యవాదాలు తెలియచేస్తున్నామన్నారు. ఇక్కడకు 150 మీటర్ల దూరంలో రానున్న బీచ్ కారిడార్ వల్ల మరిన్ని పరిశ్రమలు వచ్చి అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. దీనంతటికి మీ ముందు చూపే కారణమని కొనియాడారు.

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ టీడీపీ హయాంలో చంద్రబాబు ఉత్తరాంధ్రను, పర్యాటక రంగాన్ని విస్మరించారన్నారు. ఇక్కడి వారిని ఆయన ఓటు బ్యాంకుగా మాత్రమే చేసుకోగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు నెలల వ్యవధిలో ప్రతిష్టాత్మక మూడు ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టడం ద్వారా ఉత్తరాంధ్ర ప్రజల మనసును గెలుచుకున్నారన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి వద్ద ఎమ్మెల్యేగా పనిచేసే అవకాశం వచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్–శంషాబాద్ వలే విశాఖ–భోగాపురం మధ్య పట్టణీకరణతో పాటు ఇండస్ట్రియల్ టూరిజం, అనుబంధ పెట్టుబడుల ద్వారా అభివృద్ధి జరుగుతుందన్నారు.

ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ సీఎం జగన్ ఉత్తరాంధ్రలో అదానీ, అంబానీ వంటి వారితో సమర్థవంతమైన నాయకత్వంతో స్థిరమైన పెట్టుబడులు పెట్టిస్తున్నారన్నారు. ఇందులో 10 శాతం కూడా అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉత్తరాంధ్రకు చేయలేదన్నారు. సీఎం జగన్ ఏకకాలంలో కడప, తిరుపతి, విశాఖ ప్రాంతాలలో ఒబెరాయ్ హోటల్స్ యాజమాన్యంతో ఏడు నక్షత్రాల సదుపాయాలతో విల్లాస్, రిసార్ట్స్ అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా అన్నవరంలో నిర్మించనున్న లగ్జరీ రిసార్ట్స్‌కు కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం యూత్ కో ఆర్డినేటర్ ముత్తంశెట్టి శివ సందీష్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, పర్యాటకశాఖ ప్రాంతీయ సంచాలకుడు ఫణి శ్రీనివాస్, భీమిలి తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, ఎంపీడీవో పి.వెంకటరమణ, వ్యవసాయశాఖ సలహా మండలి జిల్లా చైర్మన్ దాట్ల పెదబాబు, స్థానిక సర్పంచ్ మేరుగు సంతోషి కుమారి, ఎల్లాజీ, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మిన రామలక్ష్మణ, కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలు, కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, నాయకులు సరగడ రఘునాథరెడ్డి, బోని అప్పలనాయుడు, జగుపల్లి ప్రసాద్, జీరు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాఖకు 40 కొత్త బస్సులు!

- వీటిలో 20 వరకు సూపర్ లగ్జరీలు
- పది అల్ట్రా డీలక్స్‌లు..
- మిగతావి ఏసీ, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు
- మూడు నెలల్లో రోడ్లపైకి వచ్చే అవకాశం



సాక్షి, విశాఖపట్నం: ఏపీఎస్ ఆర్టీసీ 1,500 కొత్త బస్సులను కొనుగోలు చేస్తోంది. టెండర్లు కూడా పిలిచింది. వీటిని దశల వారీగా ఆయా జిల్లాలకు కేటాయించనుంది. ఈ నేపథ్యంలో విశాఖ జిల్లాకు 40 వరకు కొత్త బస్సులు వస్తాయని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. వీటిలో సూపర్ లగ్జరీ బస్సులు ఎక్కువగా కేటాయించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఆర్టీసీ యాజమాన్యం కొత్తగా కొనుగోలు చేయనున్న బస్సుల్లో సూపర్ లగ్జరీ బస్సులు అధికంగా 735 ఉన్నాయి. అందువల్ల విశాఖకు వీటి కేటాయింపు ఒకింత ఎక్కువగా ఉండనుంది. సాధారణంగా 10 లక్షల కిలోమీటర్లు ప్రయాణించిన సూపర్ లగ్జరీ బస్సులను నిలిపి వేస్తారు. వాటి స్థానంలో కొత్త బస్సులను (రీప్లేస్) కేటాయిస్తారు. ప్రస్తుతం ఆర్టీసీ విశాఖ జిల్లా పరిధిలోని వివిధ డిపోల్లో 37 సూపర్ లగ్జరీ బస్సులున్నాయి. వీటిలో సుమారు 20 బస్సులు రీప్లేస్ చేయాల్సిన స్థితిలో ఉన్నాయి. ఇప్పటికే అద్దె ప్రాతిపదికన 10 సూపర్ లగ్జరీ బస్సులను తీసుకుంటున్నారు. వీటిలో ఇటీవల రెండు బస్సులు వచ్చాయి. ఈ నేపథ్యంలో 20 కొత్త సూపర్ లగ్జరీలకు అవకాశం ఉందని అంటున్నారు. ప్రస్తుతం 25 అల్ట్రా డీలక్స్‌లు, 20 ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. వీటిలో రీప్లేస్ అయ్యే అల్ట్రా డీలక్స్ బస్సులు అంతగా లేకపోయినా కొత్తగా పది బస్సులు, ఐదు వరకు ఎక్స్‌ప్రెస్‌లు వస్తాయని భావిస్తున్నారు. మరోవైపు ప్రస్తుతం 30కి పైగా వివిధ రకాల ఏసీ బస్సులున్నాయి. ఇవి 10 లక్షల కిలోమీటర్లను పూర్తి చేసుకోలేదు. అయినప్పటికీ భవిష్యత్ అవసరాల దృష్ట్యా కొత్త బస్సుల్లో ఐదు ఏసీ బస్సులను కేటాయించవచ్చని అంటున్నారు. కోవిడ్ ప్రభావంతో మూడేళ్లుగా కొత్త బస్సుల కొనుగోళ్లు లేవు. తాజాగా ఇప్పుడు కొనుగోళ్లు చేపట్టనుండడంతో విశాఖకు కొత్త బస్సుల కేటాయింపు ఆశాజనకంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. 10 లక్షల కిలోమీటర్లు నడిచిన సూపర్ లగ్జరీ బస్సులకు కొత్త బాడీలు కట్టి సిటీ బస్సులుగా మార్పు చేసి తిప్పుతారు. ఈ లెక్కన ఇలాంటి బస్సులు సిటీ అవసరాలను కొంతవరకు తీరుస్తాయి. కొత్తగా కొనుగోలు చేయనున్న ఆర్టీసీ బస్సులను దశల వారీగా కేటాయిస్తారు. దీంతో అక్టోబరు నాటికి కొత్త బస్సులు రావచ్చని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

భారత మహిళా అంధుల జట్టుకు 'వారిజా' విద్యార్థులు



కొమ్మాది: క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇండియా(సీఏబీఐ) తొలి మహిళా ద్వైపాక్షిక సిరీస్‌కు బీచ్ రోడ్డులోని వారిజా నేత్ర విద్యాలయ విద్యార్థులు ఎంపికయ్యారు. ఆగస్టు 17 నుంచి 25వ తేదీ వరకు ఇంగ్లాండ్‌లో జరిగే టీ–20 టోర్నీకి భారత జట్టుకు రాష్ట్రం నుంచి నేత్ర విద్యాలయానికి చెందిన ముగ్గురు బాలికలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బీ1 కేటగిరీలో కె. సంధ్య బౌలర్‌గా, వి.రమణి ఆల్ రౌండర్‌గా, బీ3 కేటగిరీలో ఎం.సత్యవతి వికెట్ కీపర్‌గా భారత మహిళా అంధుల జట్టుకు ఎంపికయ్యారని నేత్ర విద్యాలయ యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. ఎంపికైన విద్యార్థులకు నేత్ర విద్యాలయ, వారిజా కమిటీలు అభినందనలు తెలిపాయి.

న్యూ లుక్





పెయింటింగ్స్‌తో ఆకట్టుకుంటున్న దత్ ఐలాండ్ ప్రాంతం (ఇన్‌సెట్) వ్యర్థాలతో తయారు చేసిన సైకిళ్లు

- నగరంలో డైనమిక్ అర్బన్ స్పేస్ క్రియేషన్ సెంటర్లు
- కూర్చొనేందుకు, నడక మార్గాలు ఏర్పాటు
- దత్ ఐలాండ్ వద్ద పైలట్ ప్రాజెక్టు

దాబాగార్డెన్స్: స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా నగరంలో డైనమిక్ అర్బన్ స్పేస్ క్రియేషన్ సెంటర్లను అభివృద్ధి చేయాలని జీవీఎంసీ నిర్ణయించింది. నగరవాసులతోపాటు పర్యాటకులను ఆకట్టుకునేలా వీటిని తీర్చిదిద్దాలని యోచిస్తోంది. రద్దీగా ఉండే కూడళ్లలో ఖాళీగా ఉన్న స్థలాలను ఎంపిక చేసి ప్రజలు సేదతీరేందుకు వీలుగా అన్ని రకాల సదుపాయాలతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేలా ప్రణాళికలు రచించింది. పైలట్ ప్రాజెక్టుగా సిరిపురం కూడలిలో దత్ ఐలాండ్ ఎదురుగా ఖాళీగా ఉన్న రోడ్డును అభివృద్ధి చేస్తోంది. ఇక్కడ నేలపై రంగురంగుల డిజైన్లతో పెయింటింగ్ వేశారు. దాని మీద ప్రజలు వాకింగ్ చేయడానికి వీలుగా ఏర్పాట్లు, ఒత్తిడితో సతమయ్యే వారి మనస్సును తేలికపరిచేలా పచ్చదనం అభివృద్ధి చేయడం, కూర్చోవడానికి ఏర్పాట్లు ఇతర సదుపాయాలను కల్పిస్తున్నారు. అలాగే నగర పౌరులను ఆకట్టుకునేలా వ్యర్థాలతో తయారు చేసిన విభిన్న ఆకృతులు ఏర్పాటు చేస్తున్నారు. సిరిపురం కూడలిలో ప్రాజెక్టుకు వచ్చే ఆదరణను బట్టి నగరంలో మరికొన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసే యోచన ఉన్నట్టు జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా కేజీహెచ్ అభివృద్ధి

- రూ.2.50 కోట్లతో కొనసాగుతున్న పనులు
- నేటి నుంచి ఓపెన్ హార్ట్ సర్జరీలు ప్రారంభం
- ఆస్పత్రికి చేరుకున్న రూ.5 కోట్ల సి.టి.స్కాన్ మెషీన్
- ఎంఆర్‌ఐ స్కాన్ మెషీన్ కూడా మంజూరు
- త్వరలో కంప్యూటర్ ఆధారిత సేవలు
- కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్ వెల్లడి



మహారాణిపేట: కార్పొరేట్‌కు దీటుగా కేజీహెచ్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. రూ.2.50కోట్లతో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, సి.టి.స్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్ మెషీన్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని వెల్లడించారు. కేజీహెచ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.5 కోట్ల విలువైన సి.టి.స్కాన్ పరికరం కేజీహెచ్‌కు చేరుకుందని, గైనిక్ విభాగం ఎదురుగా ఈ పరికరాన్ని అమర్చుతున్నట్లు చెప్పారు. రూ.10కోట్ల విలువైన ఎంఆర్‌ఐ స్కాన్ మిషన్ త్వరలోనే చేరుతుందని.. ఈ రెండు పరికరాలను రేడియాలజీ విభాగాధిపతి పర్యవేక్షిస్తారని వెల్లడించారు.

ఓ రోగికి నేడు ఓపెన్ హార్ట్ సర్జరీ

కేజీహెచ్‌లో ఈ ఏడాది మార్చి 24న మిషన్ మరమ్మతుకు గురికావడంతో ఓపెన్ హార్ట్ సర్జరీలు నిలిచిపోయాయని, కొత్తగా రూ.50 లక్షల వ్యయంతో టెంపరేచర్ కంట్రోల్ మెషీన్(టీసీఎం) అమర్చినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. శనివారం ట్రయల్ పూర్తయిందని, సోమవారం ఓ రోగికి ఓపెన్ హార్ట్ సర్జరీ చేస్తున్నట్లు వెల్లడించారు. కార్డియోథొరాసిక్ విభాగాధిపతి(హెచ్‌వోడీ) డాక్టర్ కె.మణిత ఆధ్వర్యంలో ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సిబ్బంది ఉన్నారని తెలిపారు. ఓపెన్ హార్ట్ సర్జరీల కోసం 10 కేసులు సిద్ధంగా ఉన్నట్లు వివరించారు.

నేటి నుంచి రెండో క్యాజువాలిటీ నిర్మాణం

ప్రస్తుతం ఉన్న క్యాజువాలిటీ రోగులకు సరిపోకపోవడంతో.. మరో క్యాజువాలిటీ నిర్మాణానికి కలెక్టర్ అనుమతి ఇచ్చారని డాక్టర్ శివానంద్ తెలిపారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ(హెచ్‌డీసీ) నుంచి రూ.30 లక్షలు మంజూరవడంతో.. సోమవారం నుంచి పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం 20 పడకలు ఉండగా, రెండో క్యాజువాలిటీ నిర్మాణంతో మరో 20 పడకలు అందుబాటులోకి వస్తాయన్నారు. క్యాజువాలిటీ మేడ మీద ఐసోలేషన్ వార్డులో మరో 10 పడకలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆ తర్వాత ఒక్కో విభాగానికి కొన్ని పడకలు చొప్పున కేటాయిస్తామన్నారు.

పిల్లల వార్డులో రెండు యూనిట్లు

పిల్లల వార్డులో రూ.70 లక్షల వ్యయంతో రెండు యూనిట్లను ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ శివానంద్ తెలిపారు. నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఎన్ఐసీయూ), ప్రత్యేక నవజాత సంరక్షణ యూనిట్(ఎస్ఎన్‌సీయూ) నిర్మాణ పనులు చేపట్టామన్నారు. త్వరితగతిన ఈ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

రూ.50లక్షలతో సౌర విద్యుత్

కేజీహెచ్‌లో విద్యుత్ సమస్య పరిష్కారానికి 120 కేవీ సౌర విద్యుత్ ఉత్పాదన కోసం ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి సమక్షంలో ఒప్పందం కుదిరిందని, రూ.50లక్షలతో త్వరలో పనులు ప్రారంభమవుతాయని సూపరింటెండెంట్ వెల్లడించారు. ఈ నిర్మాణం పూర్తయితే కేజీహెచ్‌కు విద్యుత్ ఖర్చులు ఆదా అవుతాయన్నారు. ఆస్పత్రిలో జనన, మరణ వివరాలను కంప్యూటర్‌లో ఫీడ్ చేస్తున్నామని.. దీని వల్ల అవసరమైన సర్టిఫికెట్ల జారీ సులవవుతుందన్నారు. స్టేట్ బ్యాంక్ ఇండియా సీఎస్సార్ కింద రూ.50 లక్షలు మంజూరు చేసిందని, దీనికి కలెక్టర్ అనుమతి ఇచ్చారన్నారు. ఓపీ చిటీలు, మెడికల్ రికార్డులు, వివిధ పరీక్షల నివేదికలు అన్ని రోగి సెల్‌కు అనుసంధానం చేసే ప్రక్రియ కూడా ప్రారంభిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు, వైద్య పరీక్షల కేంద్రాల్లో ఈ పద్ధతి అమలులో ఉందని, త్వరలో కేజీహెచ్‌లో కూడా అమలు చేస్తామన్నారు.

సాయంత్రం ఓపీపై విస్తృత ప్రచారం

కేజీహెచ్‌లో అన్ని ఓపీలు సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు నిర్వహిస్తున్నామని.. దీనిపై పూర్తిస్థాయిలో ప్రచారం చేస్తామని సూపరింటెండెంట్ తెలిపారు. ఇందుకోసం ఆస్పత్రిలో సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. ఉదయం ఓపీలు యథావిధిగా కొనసాగుతున్నాయని.. సాయంత్రం ఓపీలను కూడా రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నవరసభరితం.. నాట్యం



వేదాంతం రామలింగశాస్త్రికి శోభానాయుడు, గీతానారాయణ్‌కు సత్యభామ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానం

మద్దిలపాలెం: కూచిపూడి, మోహినియాట్టం, భరతనాట్య ప్రదర్శనలు కళాభిమానులను సమ్మోహనపరిచాయి. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కళాభారతి ఆడిటోరియంలో 9వ అంతర్జాతీయ స్థాయి సత్యభామ యువ నృత్యోత్సవం రెండో రోజైన ఆదివారం అద్భుతంగా సాగింది. భారతీయత ఉట్టిపడేలా చక్కని హావభావాలతో నృత్యకారులు చేసిన నాట్యం అందరి హృదయాలను హత్తుకుంది. ముందుగా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కూచిపూడి సిద్ధేంద్ర యోగి కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రికి ఆదాయ పన్నులశాఖ కమిషనర్ ఎస్.రవిశంకర్, అనకాపల్లి ఎస్పీ కేవీ మురళీ చేతుల మీదుగా డాక్టర్ శోభానాయుడు ఎక్స్‌లెన్స్ అవార్డు–2023ను అందజేశారు. విశాఖకు చెందిన ప్రముఖ కూచిపూడి నర్తకి సూడగాని గీతానారాయణ్ సత్యభామ ఎక్స్‌లెన్స్ అవార్డును అతిథులు చేతుల మీదుగా స్వీకరించారు. మోహినియాట్టం కళాకారిణి, కేరళకు చెందిన చిత్ర సుకుమారన్‌కు ప్రత్యేక జ్యూరీ పురస్కారం అందించారు. రెండవ రోజు సూడగాని గీతా నారాయణ్ కూచిపూడి ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే అర్ధనారీశ్వర తత్వాన్ని గీతానారాయణ్ అద్భుతంగా ఆవిష్కరించారు. పలు నృత్యనికేతన్ బృందం కళాకారులు చేసిన నాట్య ప్రదర్శనలు అబ్బురపరిచాయి. ఒడిస్సీ నర్తకి దేబ మిత్ర సాహు నవదుర్గ అంశాన్ని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు బత్తిన విక్రమ్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ నృత్యోత్సవాలు ఘనంగా ముగిశాయి.



డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రికి శోభానాయుడు ఎక్సలెన్స్ అవార్డు ప్రదానోత్సవం



ముగిసిన వైఎస్సార్ కప్ బాక్సింగ్ పోటీలు



సుమన్‌ను సత్కరిస్తున్న మారుతీ బాక్సింగ్ క్లబ్ నిర్వాహకుడు మారుతీప్రసాద్, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ, విజేతకు సర్టిఫికెట్ అందజేస్తున్న విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

మధురవాడ: చంద్రంపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి సీనియర్స్ మెన్ అండ్ వుమెన్ 10వ వైఎస్సార్ కప్ బాక్సింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని జిల్లా బాక్సింగ్ క్లబ్ పర్యవేక్షణలో మారుతీ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 40 క్లబ్‌ల నుంచి 200 మంది వివిధ కేటగిరీలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన సినీనటుడు సుమన్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అక్కడ ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. నిర్వాహకుడు వంకాయల మారుతీప్రసాద్‌ను అభినందించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం సుమన్ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి అంటే తనకు ఎంతో ఇష్టమని తెలిపారు. వైఎస్సార్ కప్ బాక్సింగ్ పోటీలకు అతిథిగా రావడం ఇది నాల్గవసారన్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ఇటువంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

విజేతలు వీరే..

ఈ పోటీల్లో జీవీఎంసీ బాక్సింగ్ క్లబ్ విన్నర్స్‌గా, మారుతీ బాక్సింగ్ క్లబ్ రన్నర్స్‌గా నిలిచాయి. ప్రమోటెడ్ బాక్సర్‌గా సంతోష్, బెస్ట్ బాక్సర్‌గా సాంబ, బెస్ట్ లూజర్‌గా ప్రసాద్ నిలిచారు. కార్యక్రమంలో ఏపీ క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, జీవీఎంసీ సెక్రటరీ నల్లనయ్య, బీసీ కార్పొరేషన్ సభ్యులు కందుల మల్లికార్జునరావు, లీడర్ రమణమూర్తి, శ్రీ మాతా రికార్డింగ్ కంపెనీ అధినేత పల్లె నాగభూషణరావు, తైక్వాండో కోచ్ ఆనంద్, అర్జున అవార్డు గ్రహీత జయరాం, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు దల్లి రామకృష్ణారెడ్డి, కె.నూకరాజు, ఆర్‌వోసీ చైర్మన్ దండు నాగేశ్వరరావు, ఐ.సాయిప్రసాద్, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాలు నాయకులు బంగారు ప్రకాష్, పసుపులేటి గోపి, అల్లాడ వెంకటరావు, బంక అప్పారావు, జగ్గుపల్లి నరేష్, బైపిల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

టెన్నికాయిట్‌ను జీవో 74లో చేర్చాలి


దక్షిణాఫ్రికాలో జరగనున్న పోటీల్లో పాల్గొనే క్రీడాకారులతో ఎమ్మెల్యే గణబాబు

విశాఖ స్పోర్ట్స్/గోపాలపట్నం: టెన్నికాయిట్ క్రీడను జీవో నంబర్ 74లో చేర్చాలని, ఈ క్రీడాకారులకు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు కల్పించాలని ఏపీ టెన్నికాయిట్ అసోసియేషన్ చైర్మన్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు డిమాండ్ చేశారు. గోపాలపట్నంలో ఆయన ఇంటి వద్ద ఆదివారం రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి వస్తున్న వదంతులను నమ్మవద్దన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పేఅండ్‌ప్లే పద్ధతి వల్ల అనేక నష్టాలు ఉన్నాయని, సరిచేయాలని కోరారు. స్పోర్ట్స్ కోడ్ ప్రకారం జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు, క్రీడా సంఘాలకు ఆర్థిక సహకారం చేయాలన్నారు. క్రీడాకారులకు వైఎస్సార్ నగదు పురస్కారాలు అందిస్తున్నట్లే.. క్రీడా సంఘాలకు అందజేయాలన్నారు. సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 8 వరకు దక్షిణాఫ్రికాలో జరిగే 5వ అంతర్జాతీయ ప్రపంచ కప్ టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొంటున్న రాష్ట్ర క్రీడాకారులను ఈ సందర్భంగా ఆయన సత్కరించారు. ఈ పోటీలకు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పి.జి.ఎస్.డి. రామారావు, వినయ్ కుమార్, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన హేమామాధురి, విజయనగరం జిల్లాకు చెందిన ఆర్.మౌనిక ఎంపికయ్యారు. అసోసియేషన్ అధ్యక్షుడు వై.డి.రామారావు, ప్రధాన కార్యదర్శి ఎ.ఎస్.వి సత్యనారాయణ, కోశాధికారి పి.తవిటయ్య, నాగార్జున యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్ల జోష్

- రాష్ట్రంలో మొదటి స్థానంలో విశాఖ జిల్లా
- అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోనూ జోరందుకున్న అడ్మిషన్లు
- పది ఫలితాల పెరుగుదలతో ఇంటర్ విద్యకు డిమాండ్
- స్టూడెంట్ ఇన్ఫో నమోదుతో పక్కాగా వివరాలు
- ఫెయిలైన విద్యార్థులకు రీ–అడ్మిషన్


ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదువుకుంటున్న విద్యార్థినులు

విశాఖ విద్య: ఇంటర్ అడ్మిషన్ల జోరు పెరిగింది. నగరంలోని జైల్ రోడ్‌లో గల ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో వాస్తవంగా మొదటి సంవత్సరంలో 704 మంది విద్యార్థినులు చేరితే, ప్రభుత్వం మంజూరు చేసిన సీట్లు అన్నీ నిండినట్లే. అయితే ఈ కాలేజీలో ఇప్పటికే 790 మంది విద్యార్థినులు అడ్మిష న్లు పొందారు. 2023–24 విద్యా సంవత్సరం అడ్మిషన్లు ప్రక్రియ కొనసాగుతుండటంతో, ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. బైపీసీ, ఎంపీసీ ఇంగ్లిషు మీడియం గ్రూపులతో పాటు, ఒకేషనల్ గ్రూపు ల్లో పరిమితికి మించి చేరారు. ఇంటర్ కాలేజీల్లో ఈ ఏడాది అడ్మిషన్లు జోరు ఏ తీరుగా ఉందనే దానికి ఈ కాలేజీ నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యారంగంలో తీసుకొస్తోన్న విప్లవాత్మక మార్పులతో విద్యార్థులు ఉన్న త విద్యవైపు అడుగులు వేస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతిలో మెరుగైన ఫలితాలు రావడంతో ఇంటర్మీడియెట్‌లో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఫెయిలైన విద్యార్థులకు సైతం రీ–అడ్మిషన్ ఇచ్చి, వారిని కాలేజీలకు రప్పించాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి రాయల సత్యనారాయణ ఆధ్వర్యంలో, ప్రభుత్వ జూనియర్ కాలేజీల నిర్వాహకుల బృందం ఇళ్లబాట పడుతున్నారు. దీంతో జూనియర్ కాలేజీలు విద్యార్థులతో కళకళలాడుతున్నాయి.

అడ్మిషన్లలో విశాఖ టాప్

'స్టూడెంట్ ఇన్ఫో'లో నమోదైన గణాంకాల మేరకు ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాల్లో జిల్లా రాష్ట్రంలోని మిగతా జిల్లాలతో పోల్చితే టాప్‌లో నిలిచింది. అన్ని గ్రూపులు కలుపుకొని జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని 184 కాలేజీల్లో ఫస్టియర్‌లో 21,808 మంది అడ్మిషన్లు పొందారు. అనకాపల్లి జిల్లాలోని 134 కాలేజీల్లో 6,993 మందితో రాష్ట్రంలో ఏడో స్థానం, అల్లూరిలోని 41 కాలేజీల్లో 2,307 మంది నమోదు ద్వారా చివరి స్థానంలో నిలిచింది. ఇంటర్మీడియెట్ విద్యలోనూ ప్రభుత్వం నూతన సంస్కరణలు తీసుకొస్తోంది. విద్యార్థుల సమాచారాన్ని 'స్టూడెంట్ ఇన్ఫో' లో నమోదు చేస్తుండటంతో వాస్తవ గణాంకాలను ప్రతీ ఒక్కరూ తెలుసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తూ, ప్రభుత్వం పారదర్శకతకు పెద్దపీట వేస్తోంది.

ప్రభుత్వ కాలేజీల్లో జోష్ : ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్లు తీసుకునేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. జైల్ రోడ్‌లోని బాలికల కాలేజీలో కొన్ని ఎంపీసీ, బైపీసీ ఇంగ్లీషు మీడియం గ్రూపుల్లో సీట్లు ఇవ్వలేని పరిస్థితి ఉంది. ఇదే రీతిన డాక్టర్ వీఎస్ కృష్ణా, భీమునిపట్నం, పెందుర్తి, అనకాపల్లి జిల్లాలోని యలమంచిలి, చోడవరం అదే విధంగా అల్లూరి జిల్లాలోని జి. మాడుగుల, పాడేరు, హుకుంపేట కాలేజీల్లో ప్రస్తుతం అడ్మిషన్లు బాగున్నాయి.

ఫెయిలైన విద్యార్థులకు రీ–అడ్మిషన్

ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిలైన ఉమ్మడి విశాఖ జిల్లాలోని సుమారు 6 వేల మంది విద్యార్థులను గుర్తించిన అధికారులు, వీరిని సమీప కాలేజీల్లో రీ–అడ్మిషన్లు కల్పించేలా శ్రద్ధ తీసుకుంటున్నారు. వీరిని రెగ్యులర్ విద్యార్థులతో సమానంగానే పరిగణిస్తారు. అమ్మ ఒడి పథకం వర్తింపజేస్తారు. చదువుల్లో డ్రాప అవుట్ అనేది లేకుండా చూడాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్ఐవో సత్యనారాయణ నేతృత్వంలో విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల డీవీఈవోలతో తరచూ దీనిపై సమీక్షిస్తున్నారు. లక్ష్య సాధనకు కృషి చేస్తున్నారు.

ప్రిన్సిపాళ్లు బాధ్యత తీసుకోవాలి



ప్రభుత్వ కాలేజీల్లో అందుబాటులో ఉన్న సీట్లన్నీ భర్తీ అయ్యేలా ప్రిన్సిపాల్స్ బాధ్యత తీసుకోవాలి. అడ్మిషన్లు వివరాలను సకాలంలో స్టూడెంట్ ఇన్ఫోలో నమోదు చేయాలి. ఫెయిలైన విద్యార్థులు రీ– అడ్మిషన్ తీసుకునేలా వారి తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలి. తరగతుల నిర్వహణపై దృష్టి పెట్టాలి.

– రాయల సత్యనారాయణ, ఆర్ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో నిర్వహిస్తున్న భద్రతాపరమైన పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. గుంటూరు–విశాఖపట్నం (17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు, విశాఖపట్నం–గుంటూరు (17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు, కాకినాడ–విశాఖపట్నం–కాకినాడ (17267/17268) ఎక్స్‌ప్రెస్ ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు ఇరువైపులా, రాజమండ్రి–విశాఖపట్నం–రాజమండ్రి(07466/07467) పాసింజర్ స్పెషల్ ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు ఇరువైపులా రద్దు చేశారు.

పలు రైళ్ల దారి మళ్లింపు : పలు రైళ్లు ఆయా తేదీల్లో రెగ్యులర్ మార్గం నిడదవోలు–ఏలూరు–విజయవాడ మీదుగా కాకుండా వయా నిడదవోలు–భీమవరంటౌన్– గుడివాడ–విజయవాడ మీదుగా నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు. ధన్‌బాద్–అలెప్పీ(13351) బోకారో ఎక్స్‌ప్రెస్ ఈనెల 11,14,15 తేదీల్లో, టాటానగర్ – ఎస్ఎంవీ బెంగళూరు (12889) ఎక్స్‌ప్రెస్ ఈనెల 14వ తేదీన, హతియా– ఎస్ఎంవీ బెంగళూరు (18637) ఎక్స్‌ప్రెస్ ఈనెల 15 తేదీన, హతియా– ఎస్ఎంవీ బెంగళూరు (12835) ఎక్స్‌ప్రెస్ ఈనెల 11న మళ్లించబడిన మార్గంలో నడుస్తాయి.

పలు రైళ్ల రీషెడ్యూల్ : ఆయా స్టేషన్‌ల్లో ఆదివారం పలు రైళ్లు ఆలస్యంగా బయల్దేరాయి. ఆయా స్టేషన్‌లకు చేరుకోవలసిన పెయిరింగ్ రైళ్లు ఆలస్యంగా చేరుకోవడంతో ఈ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. చెన్నై సెంట్రల్ – షాలిమార్ (12842) కోరమండల్ ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా ఉదయం 9 గంటలకు, ఎస్ఎంవీ బెంగళూరు–జసిడి (22305) ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 12 గంటలకు, హౌరా–సికింద్రాబాద్ (12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ సుమారు 3 గంటలు ఆలస్యంగా ఉదయం 11.30 గంటలకు, సికింద్రాబాద్ – హౌరా (12704)సుమారు 4 గంటలు ఆలస్యంగా రాత్రి 7.55 గంటలకు బయల్దేరాయి.

యువతికి అసభ్యకర మెసేజ్‌లు

- యువకుడి అరెస్ట్


నిందితుడు అవినాష్

పీఎంపాలెం: అసభ్యకర మెసేజ్‌లు, నీలి చిత్రాలను మొబైల్‌కు పంపించి యువతిని వేధిస్తున్న యువకుడు సైబర్ క్రైం పోలీసులకు చిక్కాడు. సైబర్ క్రైం సీఐ కె.భవానీప్రసాద్ తెలిపిన వివరాలివీ.. చెన్నైకి చెందిన అవివాహిత యువతి నగరంలోని ప్రముఖ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. ఇటీవల ఆమె మొబైల్ ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తి అసభ్యకర మెసేజ్‌లు, నీలి చిత్రాలు పంపించాడు. దీంతో షాక్‌కు గురైన ఆ యువతి సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పెందుర్తి ప్రసాద్‌నగర్‌కు చెందిన డి.అవినాష్ ఆ యువతికి మెసేజ్‌లు పంపిస్తున్నట్లు గుర్తించారు. అతన్ని ఆదివారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

సత్తాచాటిన శ్రీవిద్య, రుత్విక్

విశాఖ స్పోర్ట్స్: ఐదు రౌండ్ల పాటు సాగిన వుమెన్ టీమ్ చెస్ సెలెక్షన్లలో ఐదు పాయింట్లతో పి.సత్యశ్రీవిద్య విజేతగా నిలవగా టాప్‌ర్యాంక్‌లో పోటీకి దిగిన యమున నాలుగు పాయింట్లతో ద్వితీయస్థానంలో నిలిచింది. ఇక అన్‌రేటెడ్ శ్రియ, రేటెడ్ దివ్యదర్శిని వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో నిలిచారు. వీరంతా నాలుగేసి పాయింట్లతో నిలిచినా యమున టైబ్రేక్స్‌లో ఆధిక్యంలో నిలిచింది. ఇక ఓపెన్ టీం సెలెక్షన్స్‌లో భాగంగా ఏడు రౌండ్లపాటు పోటీలు జరిగాయి. ఎం.వి.రుత్విక్ విజేతగా నిలిచాడు. అఖిల్‌ప్రసాద్, అఖిల్, చంద్రశేఖర్, వై.శ్రీనివాసరావు సైతం ఆరేసి పాయింట్లతో పోటీలను ముగించారు. అయితే టై బ్రేక్స్‌లో ఆధిక్యతతో వరుసగా తొలి ఐదు స్థానాల్లో నిలిచారు. ఆల్ విశాఖ చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు ఆదివారం జరిగాయి.

నేడు డయల్ యువర్ ఆర్డీవో

మహారాణిపేట: విశాఖ ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ సోమవారం 'డయల్ యువర్ ఆర్డీవో' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు 0891 –2562977కు ఫోన్ చేయవచ్చు.

విద్యారంగం అభివృద్ధిలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర

ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి పైడిరాజు


మాట్లాడుతున్న పైడిరాజు

విశాఖ విద్య : విద్యారంగం అభివృద్ధిలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇమంది పైడిరాజు అన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్‌లో జరిగిన సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై లోతైన చర్చ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు విజయవంతంగా పూర్తి చేయటం అభినందనీయమేనని, అయితే ఈ ప్రక్రియలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలన్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరిగిన బదిలీలు, పదోన్నతుల్లో చాలా మంది ఏజెన్సీలోని మారుమూల ప్రాంత స్కూళ్లకు వెళ్లాల్సి వచ్చిందని, దీని కారణంగా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ విషయాన్ని విద్యాశాఖాధికారుల దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లినట్లు తెలిపారు. విద్యారంగ సమస్యలు–భవిష్యత్‌లో సంఘం తరుపున చేపట్టాల్సిన కార్యక్రమాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. కౌన్సిల్ జిల్లా బాధ్యులు రమణాజీ, శ్రీధర్ రెడ్డి, పీఎస్ఎన్ మూర్తి. రామిరెడ్డి, దేవుడు బాబు, వరహాలు దొర, శ్రీధర్, జయప్రసాద్, రామకృష్ణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమైక్య కృషి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటపతిరాజు

మురళీనగర్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సమైక్యంగా కృషి చేద్దామని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటపతిరాజు పిలుపునిచ్చారు. మాధవధార జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొటాన శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా ఏపీటీఎఫ్ కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా ఇటీవల బదిలీల్లో వెళ్లిన ఉపాధ్యాయులందరికి జీతాలు సకాలంలో అందే విధంగా అధికారులతో సమన్వయంగా పనిచేయాలన్నారు. విశాఖ జిల్లాలో నూతనంగా ఏర్పడిన మండలాలకు నియమించిన మండల విద్యాశాఖాధికారులకు డీడీవో నంబర్లు కేటాయించి ఉపాధ్యాయులకు జీతాలు మంజూరు చేసే విధంగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖ జిల్లాలో మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీకి బదిలీ చేసిన ఉపాధ్యాయులందరిని మైదాన ప్రాంతాల పాఠశాలలకు తిరిగి నియమించాలని డిమాండ్ చేశారు. ఎయిడెడ్ యాజమాన్యం నుంచి ప్రభుత్వ, లోకల్ బాడీ యాజయాన్యంలో విలీనం చేసిన ఉపాధ్యాయులను మున్సిపల్ పాఠశాలల్లో నియమించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొటాన శ్రీనివాస్‌తోపాటు జిల్లా ప్రధాన కార్యదర్శి తమలాల రామకృష్ణ, జిల్లా అర్బన్ ప్రధాన కార్యదర్శి ఎస్.పెద్దినాయుడు ప్రసంగించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

17 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

రూ.1,61,060 నగదు, 18 మొబైళ్లు స్వాధీనం

డాబాగార్డెన్స్: గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న 17 మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలివీ.. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి గ్రీన్‌పార్క్ హోటల్ సమీపంలోని శ్రీనివాస అపార్ట్‌మెంట్ రెండు, మూడు అంతస్తుల్లో పేకాట ఆడుతున్నట్టు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారంఅపార్ట్‌మెంట్‌పై దాడి చేసి.. పేకాట ఆడుతున్న 17 మందిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1,61,060 నగదుతో పాటు, 18 మొబైళ్లు, కార్డులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని టూటౌన్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వం దృష్టికి డీఎస్సీ–98 ఉపాధ్యాయుల సమస్యలు

వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చొక్కాకుల సూర్యనారాయణ


చొక్కాకులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

విశాఖ విద్య: డీఎస్సీ–98 ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, తగిన పరిష్కారం చూపేలా వైఎస్సార్ టీఎఫ్ పక్షాన కృషి చేస్తామని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చొక్కాకుల సూర్యనారాయణ అన్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఇటీవల ఎన్నికైన ఆయన్ని డీఎస్సీ–98 ఉపాధ్యాయులు స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. డీఎస్సీ–98 ద్వారా ఎంపికైన వారికి ఉపాధ్యాయులుగా పనిచేసే అవకాశం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని, అయితే రిటైర్‌మెంట్‌కు దగ్గరలో ఉన్న వారిని కూడా ఏజెన్సీ ప్రాంతాలకు కేటాయించటం వల్ల ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించాలని ఉపాధ్యాయులు విన్నవించారు. ఎంతో మందికి మేలు చేసేలా నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం, భవిష్యత్‌లో అందరికీ సంతోషకరమైన నిర్ణయాలు తప్పకుండా తీసుకుంటుందని సూర్యనారాయణ అన్నారు. సిరికి సూర్యనారాయణ, ఒబ్బిన వెంకటరావు, సంజీవ్ రావు, కొరుపోలు సూరిదేవుడు తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలిగితే రౌడీషీట్ ఎత్తివేత

బీచ్‌రోడ్డు: రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని విడిచిపెట్టాలని.. లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ హెచ్చరించారు. నగరంలోని రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. నేర ప్రవృత్తి విడిచి సత్ప్రవర్తనతో మెలిగితే రౌడీషీట్ ఎత్తివేతకు కృషి చేస్తామన్నారు. మీపై ప్రత్యేక నిఘా ఉంటుందని, కౌన్సెలింగ్‌కు హాజరు కాకపోయినా, నేరాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లను హెచ్చరించారు.

ఏసీఏ సీఈవోకు గౌరవ డాక్టరేట్


శివారెడ్డి

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర క్రికెట్ సంఘం సీఈవో ఎం.వి.శివారెడ్డి గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. సెయింట్ మదర్‌థెరిస్సా యూనివర్సిటీ నుంచి ఆయన ఈ అవార్డును స్పోర్ట్స్ కేటగిరిలో అందుకున్నారు. చిన్నతనం నుంచి డాక్టరేట్ అందుకోవాలని కలగనే వాడినని.. అది ఈ రోజు నిజమైందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

అలరించిన నృత్య పోటీలు

ఏయూక్యాంపస్: అఖిల భారత నాట్య రవళి మ్యూజిక్ అండ్ డాక్టర్స్ అకాడమీ అఖిల భారత నృత్యోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఏయూ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అసెంబ్లీ మందిరంలో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో దాదాపు 500 మంది కళాకారులు పాల్గొన్నారు. ముగింపు వేడుకల్లో కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరావు, ఏయూ సంగీత విభాగాధిపతి ఆచార్య అనురాధ, నటరాజ్ పరమేశ్వర్, సన్ మూర్తి, వ్యాఖ్యాత రాజేంద్ర ప్రసాద్, నాట్య రవళి సంస్థ నిర్వాహకులు మహేష్ బాబు పాల్గొన్నారు. చిన్నారులు శాస్త్రీయ, జానపద నృత్యాలతో అలరించారు.

అర్హులందరికీ అమ్మ ఒడి

నగరంలోని మోదవలసకు చెందిన పోలిపల్లి కాంతమ్మ బ్యాంకు ఖాతాలో అమ్మ ఒడి డబ్బులు జమకాలేదని కుమార్తె చదువుతున్న స్కూల్లో వాకబు చేసింది. సచివాలయంలో ఈకేవైసీ ధ్రువీకరణ చేయించుకోవాలని ఉపాధ్యాయులు చెప్పారు. సమీప సచివాలయంలో ఈకేవైసీ అథంటికేషన్ చేస్తే.. విద్యార్థిని పేరు కాంతమ్మ ఉంటున్న ఇంటి నంబర్‌తో మ్యాపింగ్ కాలేదు. వేరే వారి రేషన్ కార్డులో విద్యార్థిని పేరు చూపిస్తోంది. పరిశీలన చేసిన సచివాలయ సిబ్బందికి అసలు విషయం తెలిసింది. కాంతమ్మ గార్డియన్‌గా ఉంటూ చదివిస్తోందని.. ఆ విద్యార్థిని తల్లిదండ్రులు వేరే చోట ఉంటారని వెల్లడైంది.

మధురవాడకు చెందిన ఎం.గంగాధర్ ఇంటర్మీడియట్ చదువుతున్న తన కుమార్తెకు అమ్మ ఒడి డబ్బులు జమ కాలేదని సచివాలయంలో సంప్రదించాడు. సచివాలయ సిబ్బంది పరిశీలన లో అసలు ఆ విద్యార్థిని పేరు చైల్డ్ ఇన్ఫోలోనే నమోదు కాలేదని తేల్చి చెప్పారు. 10వ తరగతి వరకు అమ్మ ఒడి డబ్బులు వచ్చాయని, సంపత్ వినాయక ఆలయం సమీపంలోని మా అమ్మాయి చదువుతున్న కార్పొరేట్ కాలేజీ నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే తాము నష్టపోయామని బాధిత విద్యార్థిని తండ్రి తెలిపాడు. డబ్బులు జమ కాలేదన్న ఫిర్యాదులపై సచివాలయం కార్యదర్శులు పరిశీలన చేయగా.. ఇలా అసలు విషయాలు వెలుగుచూస్తున్నాయి.

- ఈకేవైసీతో పారదర్శకతకు పెద్దపీట
- డబ్బులు జమ కాని వారికి మరో అవకాశం
- సచివాలయ స్థాయిలో సమగ్ర పరిశీలన
- సాంకేతిక సమస్యలు పరిష్కరించేలా ఏర్పాట్లు
- విద్యా సంక్షేమ కార్యదర్శికి బాధ్యతలు


డబ్బులు జమకాని వారి ఈకేవైసీ అథంటికేషన్ చేస్తున్న సచివాలయ సిబ్బంది

విశాఖ విద్య: అమ్మ ఒడి పథకం డబ్బులు బ్యాంకుల్లో జమ కాని అర్హులైన లబ్ధిదారుల సమస్యను పరిష్కరించేలా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. డబ్బులు జమ కాని వారి జాబితాపై సచివాలయ స్థాయిలో ప్రస్తుతం జరుగుతున్న నిశిత పరిశీలనతో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. వివరాలు సవ్యంగా లేని విద్యార్థులకు మాత్రమే డబ్బులు జమ కాలేదు. అర్హులైన ఏ ఒక్క విద్యార్థికీ డబ్బులు అందలేదనే మాట రాకూడదని ప్రభుత్వం స్పష్టం చేయడంతో.. జిల్లా అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. అర్హులు కాకున్నప్పటికీ అమ్మ ఒడి డబ్బులు జమ అయినట్లు, కొన్ని ప్రైవేట్ కాలేజీలు విద్యార్థుల వివరాలను సవ్యంగా నమోదు చేయకపోవడం వంటి అంశాలను గుర్తించారు.

సచివాలయాల్లో సమగ్ర పరిశీలన

అమ్మ ఒడి పథకం నాలుగో విడత అమలులో భాగంగా 2022–23 విద్యా సంవత్సరంలో చైల్డ్ ఇన్ఫోలో నమోదైన గణాంకాల మేరకు జాబితాను సిద్ధం చేశారు. విశాఖ జిల్లాలో టెన్త్, ఇంటర్మీడియట్ చదువుతున్న 1,70,567 మంది విద్యార్థులకు రూ.255.70 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో ఎంత మందికి డబ్బులు జమ అయ్యాయి, ఇంకా పడనివారెవరైనా ఉన్నారా? అనేది సచివాలయ స్థాయిలో పక్కా లెక్కతీస్తున్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల జాబితా

జిల్లాలో గతేడాది (2021–22 విద్యా సంవత్సరం) 1,75,467 మందికి అమ్మ ఒడి డబ్బులు జమయ్యాయి. ఈ ఏడాది లబ్ధిదారుల సంఖ్య కొద్దిగా తగ్గింది. గతంలో కొంతమంది ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది పిల్లలకు కూడా అమ్మ ఒడి జాబితాలో చేర్చారు ఈకేవైసీ ధ్రువీకరణతో ఇలాంటి వారిని గుర్తించారు. అదే విధంగా ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లిస్తున్న వారు, విద్యుత్ వాడకం అత్యధికంగా ఉన్న వారి వివరాలను మరో మారు పూర్తి స్థాయిలో పరిశీలన చేసే క్రమంలోనే కొంతమంది పేర్లను హోల్డ్‌లో పెట్టారు. వాస్తవంగా అర్హులని తేలితే.. వారి నుంచి దరఖాస్తులను తీసుకొని, జాబితాలో పేర్లు చేర్చి, పథకం మంజూరు చేసేలా సచివాలయ విద్యా కార్యదర్శులకు అవకాశం కల్పించనున్నారు.

అర్హులందరికీ పథకం వర్తింపు



అర్హులైన విద్యార్థులందరికీ జగనన్న అమ్మ ఒడి డబ్బులు అందించేలా విద్యాశాఖ పరంగా తగిన చర్యలు తీసుకుంటున్నాం. సచివాలయం కేంద్రంగా లబ్ధిదారుల మ్యాపింగ్ జరిగింది. బ్యాంకుల్లో డబ్బులు జమకాని లబ్ధిదారులు, సమీపంలోని సచివాలయాల్లో సంప్రదించాలి. అర్హులైనట్లేతే తప్పనిసరిగా డబ్బులు వస్తాయి. ఈ విషయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తగిన శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించాం.

– ఎల్.చంద్రకళ, డీఈవో